# Bala Bhasha Compilation by Smt.I Pramila Kumari

## బాలభాష

**వే ॥ ప్రభాకరశాస్త్రి**

### 1. శ్రీ సూర్య నారాయణా

పుట్టేటి భానుడా, పుష్యరాగపుఛాయ
శ్రీ సూర్య నారాయణా !
పుష్యరాగముమీద పొంగు బంగరుచాయ
శ్రీ సూర్యనారాయణా

జామెక్కి భానుడా, జాజిపువ్వులచాయ
శ్రీసూర్య నారాయణా
జాజి పూవుల మీద సంపెంగ వువచాయ
శ్రీ సూర్య నారాయణా

మధ్యాన్నభానుడా మల్లెపూవులచాయ
శ్రీ సూర్య నారాయణా
మల్లెపూవులమీద మంచి వజ్రపుచాయ
శ్రీ సూర్యనారాయణా

మూడ్జాముల భానుడా, మునగపూవులచాయ
శ్రీ సూర్యనారాయణా
మునగ పూవులమీద ముత్యాల పొడిచాయ
శ్రీ సూర్యనారాయణ

క్రుంకేటి భానుడా, గుమ్మడి పూవు చాయ

శ్రీ సూర్య నారాయణా
గుమ్మడి పూవుమీద కుంకుంపువుచాయ
శ్రీ సూర్య నారాయణా
ఆయురారోగ్యములు ఐశ్వర్యములనిమ్ము
శ్రీ సూర్యనారాయణ

ప్రత్యక్ష దైవమైన భాస్కరుని కంటికి
కనిపించే పూవులు ఆకులు రాళ్ళు
వీనిరంగులతో పోల్చుతూ సూర్య
నమస్కారాలు చేయటము కన్పిస్తుంది.

## 2. మేలుకొలుపు

చిన్నారి పొన్నారి చిట్టినా తల్లి !
చుక్కల్లో చంద్రుడూ చూడవచ్చాడు.

తెల్లవారొచ్చింది కోడి కూసింది
చూచేటి  అక్కల్లు చూడరాదమ్మ

ఆడేటి అక్కల్లు ఆడరాదమ్మ
ఆడుకో రారమ్మ అక్కల్లు మీరు.

ఆడేటి వారికి అచ్చావుపాలు
పాడేటి వారికి పాలుపంచదార

## 3. చలికంఠము

చలి చలి చలి చలి చందాయమ్మ
గొంగళి కప్పుకో గోనాయమ్మ
వడ వడ వడ వడ వణికేనమ్మ
చలిమంటకు చితుకులు తేవమ్మ.

పిల్లలు చలికి వణుకుతూ కంఠము చుట్టూ చికుని
బట్ట మడత పెట్టి రెండు మూడు చుట్లు కాళ్ళ
దాకా వచ్చేటట్టు చుట్టించుకుని వెండ ప్రక్కను
ముడి వేయించుకుంటారు
దా ని పేరు చలికంఠము
చలిమంట వేస్తే చలిగిలి
హుష్ కాకి అని పెద్దలు పిల్లల్ని లేపేస్తారు.

## 4. ఉగ్గు

ఊ ఊ ఉంగన్న
ఉగ్గుపాలు ఇందన్న
గుంటెడు కక్కక మింగన్న
ఊ ఉ ఉ ఉంగన్న.
లుంగలు పెట్టకు గ్రుక్కన్న
ఓర్వని సవతులు దిష్టన్న
ఒప్పగ మసలర బుచ్చన్న.

జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం !
గుఱ్ఱాలు తిన్న గుగ్గిళ్ళరిగి,
ఏనుగులు తిన్న వెలక్కాయలరిగి
అర్జునుడు తిన్న అరటిపళ్ళరిగి,

గణపతి తిన్న ఖజ్జాలరిగి,
అబ్బాయి తాగిన పాలు ఆముదం అరిగి,
పందల్లే పాకి, కుందల్లే కూర్చుండి
నందల్లే నడిచి గుఱ్ఱమంత పరుగు
ఏనుగంత సత్తువు ఉండేటట్టు
సాకుమీ, ఈ బిడ్డను సంజీవరాయా !

## 5. కలువరేకుల కళ్ళు

పిల్లమ్మ కన్నుల్లు బీరపువ్వుల్లు,
అబ్బాయి కన్నుల్లు కలువరేకుల్లు,

కలువరేకులవంటి నీ కన్నులకును,
కాటుకలు పెట్టితే నీకు అందము

ఏడువకు, ఏడువకు వెఱ్ఱిఅబ్బాయి
ఏడిస్తే నీ కళ్ళు నీలాలు కారు

నీలాలు కారితే నేచూడలేను
పాలైన కారవే బంగారు కళ్ళు.

పొద్దున్నే నిద్రలేపి, పాలుపట్టి,
ముస్తాబులు ముగించిన బిడ్డను
దేవునికి నమస్కారము చేయించి
తర్వాత బడిలోనికి పంపుటను ఒక
వరుసగా ఉత్సాహ పూరితముగా
సంకలనము చేశారు.

## 6. శ్రీరాములవారు

ఉత్తముని పేరేమి ?
ఊరి పేరేమి ?
సత్య పురుషుల కన్న
సాధ్వి పేరేమి ?

ఉత్తముడు దశరథుడు
ఊరు అయోధ్య
సత్య పురుషుల కన్న
సాధ్వి కౌసల్య

ఇల్లాళ్ళు ముగ్గురే
ఈ దశరథునకు
పిల్లాళ్ళు నలుగురే
పేరు గలవారు.

అయోధ్యలో వారు
అందకున్నారు
సయ్యోధ్యలో వారు
సరిలేనివారు

శ్రీరామ, జయరామ, శృంగార రామ
కారుణ్యగుణధామ, కళ్యాణరామ
జగతిపై రామయ్య జన్మించినాడు
సత్యమ్ము లోకాన స్థాపించినాడు.

తల్లిదండ్రుల మాట చెల్లించినాడు
ఇల్లాలితో పాటు హింసపడ్డాడు
సీతా మహాదేవి సృష్టిలోపలను
మా తల్లి వెలసింది మహనీయురాలు

అయోధ్యరామయ్య అన్నయ్య మాకు
వాలుగన్నుల సీత వదినమ్మ మాకు
రాములంతటి వాడు వటుపడ్డాడు
మానవులకెట్లమ్మ మాటపడకూడ

సీతమ్మ రామయ్య దారిగవిలీతె
పారిజాతపు పువులు పలవరించినవి

సీతపుట్టగనేల, లంకచెడనేల,
లంకకు విభీషణుడు రాజుగానేల ?

ఏడు ఏడు యేండ్లు పదునాలుగేండ్లు
ఎట్టులుంటివి సీత నట్టడవిలోను ?

లక్ష్మయ్య నామరిదిరక్షిస్తూ వుండ
నాకేమి భయమమ్మ నట్టడవిలోను ?

దేవునంతటి వాడు జన నిందపడెను.
మానవుండెంతయ్యా మాటపడకుండ ?

అన్నదమ్ములు లేక, ఆదురువులేక,

తోడూ లేక సీత దూరమైపోయె

దండమ్ము దండమ్ము దశరథరామ
దయతోడమముగావు దాక్షిణ్యధామ

## 6. చదువు సందెలు

విఘ్నము లేకుండ విద్యనీయవయ్య,
విఘ్నేశ్వరుడ నీకు వేయి దండాలు

ఉంగరములు పెట్టి, ముంగురులు దువ్వి
ఒద్ద పెట్టుకు తల్లి ముద్దులాడింది
పలక బలపము లిచ్చి, పద్యాలు పాడి
సరస పెట్టుకు తండ్రి చదువు నేర్పాడు

చదువుకో నాయమ్మ చదువుకో తండ్రి
చదువుకొంటే నీకు సౌఖ్యమబ్బేను
ఆడుకో నాయమ్మ ఆడుకో తండ్రి
ఆడుకొంటే నీకు హాయికలిగేను

పిల్లలందరురండి బళ్లోకిపోయి
చల్లన్ని గాలిలో చదువుకొందాము

విసరు విసరూ గాలి విసరవే గాలి
మల్లె పూవులగాలి మామీద విసరు

అరటిపండూ తీపి, ఆవుపాల్తీపి

మాచిన్ని అబ్బాయి (పాపాయి) మాటల్లుతీపి

చదువంటే అబ్బాయి (పాపాయి)
చండికేశాడు
బద్దెపలుపారాపె
బుద్ధి చెప్పాలి
చదువంటే అబ్బాయి (పాపాయి)
సంతోషపడును
అగసాలి రావయ్య
నగలు చేయాలి

పొరుగు పిల్లలతోను పోట్లాడబోక
ఇరుగు పిల్లల తోను యేట్లాడబోక

చక్కగా నీ చదువు
చదువుకో తండ్రి (తల్లి)
చదువుకొంటే నీకు
సౌఖ్యమబ్బేను

## 9. మంచి మాటలు

ఒంటి కంతా నెప్పి ఒరగాలి తీపు,
పంటి పోటు వద్దు పగవాడికైన

ఓ చేడెకు తగిలె మోచేతిదెబ్బ
అత్తింటి సౌఖ్యమని అంగలార్చింది.

విద్య లేకుంటేను విభవమ్ము రోత
వినయమ్ము లేకుంటె విద్యలూ రోత

నిదురలో ప్రాణమ్ము అదరునో ఏమో
నిష్టురా తేలమ్మ కష్టజీవులపై ?

మారుతల్లీ చేత మాటపడలేక
సారంగ ధరుమ్మ చావుకొప్పాడు.

కృష్ణమ్మ వంటి వాడు కొడుకొకడు పుడితే
కష్టాలు కడతేరు కన్నతల్లులకు

బియ్యమ్ము తెల్లన్న పిండి తెల్లన్న
వరుస తప్పినవాని వలికి తెల్లన్న
వరుస గానీ దాన్ని వరుసలాడేవు
పాపాత్మ నీ శిరసు పక్కున పగులు.

కాలినిండా గుడ్డ వెయ్యంది రోత
కాని వాళ్ళ కన్నెత్తి చూచింది రోత
మంచి గంథపు చెక్క సానసే చీకు
మంచాలి దేహమ్ము మనసులో చీకు.

ఆయుస్సు మూడినను
ఆకు చిరిగినను
బ్రతికించువారెవరు ?
అతుకు వారెవరు ?

## 8. చెలిమి

కానివారీతోను
కావించు చెలిమి
కట్టె విరిచీ పొయిని
పెట్టి నట్లుండు
అయిన వారితోను
కావించు చెలిమి
ఆకు మడిచీ, మడత
పెట్టినట్లుండు
కానివారి మాట కంట్లోది నలుసు
ప్రాణం పోయిందాక ప్రక్కలోపోయి
అయినవారీ మాట అమృతంపు తేలు
బ్రతికి ఉన్నందాక భాగ్యంపుమూట

## 9. ఎందుకు ?

ఎండలు కాసే దెందుకురా ?
మబ్బులు పట్టే టందుకురా

మబ్బులు పట్టే దెందుకురా ?
వానకు కురిసే టందుకురా

వానలు కురిసే దెందుకురా ?
చెరువులు నిండే టందుకురా.

పంటలు పండే దెందుకురా ?

ప్రజలు బ్రతికే టందుకురా.

ప్రజలు బ్రతికే దెందుకురా ?
స్వామిని గొలిచే టందుకురా.

స్వామిని గొలిచే దెందుకురా ?
ముక్తిని పొందే టందుకురా.
చిన్న చిన్న ప్రశ్నలతో జీవిత సత్యాలు
ఋతు ధర్మాలు తెలిపే పాట.

## 10. కంచి కామాక్షమ్మ

కంచికి పోతావా కృష్ణమ్మ
ఆ కంచి వార్తలేమి కృష్ణమ్మ ?

కంచిలో వున్నది అవ్వ
ఆ అవ్వ నాకు పెట్టు బువ్వ.

బువ్వ ఉన్నది గాని కృష్ణమ్మా
నీకు పప్పు ఎక్కడిదోయి కృష్ణమ్మ ?
కోమటి యింటిది అప్పు
ఆ - అప్పు నాకు పెట్టు పప్పు

పప్పు ఉన్నదిగాని కృష్ణమ్మ
నీకు కూర ఎక్కడిదోయి కృష్ణమ్మా ?
దొడ్లోను ఉన్నది బీర
ఆ- బీర నాకు పెట్టు కూర

కూర ఉన్నది గాని కృష్ణమ్మా
నీకు నెయ్యి యెక్కడిదోయి కృష్ణమ్మా ?
కోమటి అక్కమ్మ చెయ్యి
ఆ - చెయ్యి నాకు పోయి నెయ్యి.
నెయ్యి ఉన్నదిగాని కృష్ణమ్మ
నీకు పెరుగు ఎక్కడి దోయి కృష్ణమ్మ
ఉన్నయింటి యిరుగు పొరుగు
ఆ - పొరుగుపోయి నాకు పెరుగు

బువ్వతిందువుగాని కృష్ణమ్మ
నీకు - ఆ ఉళ్ళో పని ఏమి కృష్ణమ్మా ?
అక్కడ వున్నది అమ్మ,
నేను - మొక్కి వస్తును కామాక్షమ్మ

ఊరెళ్ళిన స్నేహితురాలిని అక్కడ ఏమేంతిన్నావు
ఎలావున్నావు అని అడిగిన పిమ్మటే అక్కడ పని ఏమని

## 11. ఉన్న ఊరు

ఉన్న ఊరూ విడిచి ఉండనే లేము
కన్న తల్లిని విడిచి ఘడియుండలేము

ఉన్న ఊరే నాకు చెన్న పట్టమ్ము,
కన్న తల్లే నాకు కల్పవృక్షమ్ము

## 12. కాకమ్మ

కాకమ్మ, కాకమ్మ, చుట్టాలోచ్చారు చూచిపో

పక్కాలోచ్చారు పారిపో
నీ కాలికి గజ్జకడతా, కాలుతీసి ఖంగున గంతెయి
చందమామ బొట్టు
నా సందిటి కేసి కట్టు
ఊళ్ళో వుంటే ఒట్టు
నీవు వచ్చిన దారినిబట్టు

## 13. అయిదువేళ్ళు

చుట్టాల సురభి - బొటనవ్రేలు
కొండేల కొరివి - చూపుడువ్రేలు
పుట్టు సన్యాసి - మధ్యవ్రేలు
ఉంగరాల భోగి - ఉంగరపువ్రేలు
పెళ్ళికి పెద్ద - చిటికెన వ్రేలు
తిందాం తిందాం - ఒక వేలు
ఎట్లా తిందాం - ఒక వేలు
అప్పుచేసి తిందాం - ఒక వేలు
అప్పెట్టా తీరుతుంది - ఒక వేలు
ఉన్నాగదా నేను అన్నింటికి
పొట్టివాణ్ణి - గట్టివాణ్ణి - బొటనవేలు

## 14. సహజగుణము

చిమడకే చిమడకే ఓ చింతకాయ
నువ్వెంత చిమిడినా నీ పుల్లపోదు
ఉడకకే ఉడకకే ఓ ఉల్లిపాయ
నువ్వెంత ఉడికినా నీ కంపు పోదు

## 15. పరాచకాలు

వదినగారూ మీరు వాసిగలవారు
వండబోయిన చోట కుండనాకేరు
బావగారూ మీరు ప్రతిభగలవారు
నిండిన్న సభలో పిండి బొక్కేరు

అత్తింటి కోడలూ అలిగి పడుకుంది
అలకల్లు తీర్చవే ములుకుల్లకట్టి

అట్లు తిని అన్నయ్య అలిగి పడుకుంటే
తిట్లు తిని వదినమ్మ తీపులందింది

పొద్దోయి పొద్దోయి అన్నయ్యవస్తే
జల్తారు చీరల్లు కట్టు వదినమ్మ

చింతాకు చక్కన్న చీర చక్కన్న
సిరిదేవి మా వదిన చీర చక్కన

బావా బావా పన్నీరు
బావను పట్టుకు తన్నేరు
వీధీ వీధీ తిప్పేరు
వీశెడు గంథం పూసేరు
చావడి గుంజకు కట్టేరు
చప్పిడి గుద్దులు గుద్దేరు

అందలము కోరింది కుందనపు కుచ్చు,
అతిభోగి కోరాడు అత్తవారిల్లు
పల్లకి కోరింది పచ్చని కుచ్చు
పరదేశి కోరాడు పంచటురంగు యిల్లు

## 16. అట్ల తద్ది

అట్ల తద్దోయి, అట్ల తద్దోయి
ముద్దపప్పోయ్, మూడట్లోయ్
చిప్ప చిప్ప గోళ్ళు, సింగరయ్య గోళ్లు
మా తాత గోళ్లు, మందాపరాళ్ళు

## 17. చప్పట్లు

చప్పట్లోయి, తాళలోయి
దేవుడి గుళ్ళో మేళాలోయ్
పప్పు బెల్లం దేవుడికోయ్
పాలూ నెయ్యి పాపాయికోయ్

గోవిందుడమ్మా, గోపాలుడమ్మా
కొబ్బరి బెల్లమ్ము కొనితెచ్చినాడే
ఏడాది కొకసారి ఇటువచ్చినాడే
పల్లెటూళ్ళు గాన చెల్లిపోయింది
గొల్లవాళ్ళముగాన, కూడివచ్చింది
పట్న వాసములోన పనికివస్తుందా ?

## 18. బండిపోటు

బండోయమ్మ బండి, బండికి కుచ్చులు తెండి
సుబ్బారాయుడి పెండ్లి,  చూచి వత్తాంరండి.
అమ్మనాకు బువ్వ, అరచేతిలోగవ్వ,
నీళ్ళమీది నిప్పు, అల్లరిపిల్లల ఒప్పు
చేయబోకు తప్పు, చేస్తే కాలి చెప్పు.

## 19. గచ్చకాయలు

ఒక్కటి ఓ చెలియా,
రెండూ రోకళ్ళు
మూడూ ముచ్చిలకా
నాలుగు నందగోపులు
అయిదుం బేడల్లు
ఆరుం జవ్వాది
పెడూ యెలమంద
-------------

## 20. బలాబలాలు

చెన్నపట్నం, చెరుకుముక్క
నీకో ముక్క, నాకో ముక్క,
భీముడి పట్నం బిందెల జోడు
నీకోబిందె నాకో బిందె
కాళీపట్నం, కాసులజోడు
నీకోకాసు, నాకోకాసు

## 21. వానా వల్లప్పలు

ఇక్కడి నుంచి పిల్లల పాటల్లో ఆయుర్వేద వేదాంతము ఇత్యాదులు వస్తాయి.

వల్లప్పా - వల్లప్పా వానకురుస్తోందంటుంది చెల్లెలు. బయటకు పోక చెల్లెలును వాకిట్లోనే ఆడుకోమంటాడు వల్లప్ప. వానలో తిరిగితే కొండమీది నుండి (ఆకాశం నుండి) గుండురాళ్ళు (వడగళ్ళు) పడి కొక్కిరాయి (అల్లరి పిల్లవాడు) కాలు విరిగింది. కాబట్టి వానలోకి పోవద్దని వల్లప్ప అంటే కాలు విరిగితే మందు ఏదని చెల్లెలు అడుగుతుంది.

వేపాకు, పసుపు, వెల్లుల్లిపాయ నూనెలో వండి - ఇవన్నీ కలిపి నూటొక్క సారి వండి ( ఆవర్తిత తైలము) ఆ తైలమును పూటకొకసారి విరిగిన కాలుకు రాస్తే కూడుకుంటుందంటాడు వల్లప్ప.

| | |
|---|---|
| వానా వానా వల్లప్ప | వేపాకు పసుపు |
| వాకిలి తిరుగూ చెల్లప్ప | వెల్లుల్లిపాయ |
| కొండమీది గుండురాయి | నూనెలోవండి (నూనెమ్మబొట్టు) |
| కొక్కిరాయి కాలువిరిగి | నూటొక్కసారి |
| దానికేమిమందు ? | పూయవోయినూరి |
| | పూటకొక్కతూరి |

## 22. నేతిలో నేరేడు పండు

చిట్ల పొట్లకాయ, సీమనెల్లికాయ
గోడ పుచ్చకాయ, గొబ్బినెల్లికాయ
అత్తకు పెడితే అల్లం, నేతింటే బెల్లం,
కొత్తకుండల్లోని గోధుమల్లారా !
పాలపిడతల్లోని పసిబిడ్డలార !
అమ్మ అమ్మ నీ బిడ్డ పేరేమంటే
నీళ్ళలో నిమ్మపండు
పాలల్లో పనసపండు

నేతిలో నేరేడు పండు.

## 23. కాళ్ళా గజ్జీ........

కంకాళమ్మ అంటే కచూరం వేగులచుక్క
బావంచా, వెలగ మొగ్గ పాదరసం, మొగ్గా
కాదు నిమ్మల వాయి అంటే - పాదరసం
బదులు నిమ్మ రసం - ఇవన్నీ వాడితే చర్మ వ్యాధి పోతుందని అర్థం.

కాళ్ళాగజ్జీ కంకాళమ్మా
వేగులచుక్కా, వెలగామొగ్గా
మొగ్గాకాదు, మోదుగనీరు
నీరూ గాదు నిమ్మలవాయి
వాయీగాదు, వావింటాకు (కూర)
కూరాగాదు, గుమ్మడిపండు
పండుగాదు,పాపిడిమీసం,
లింగూ లిటుకు, పందిమాల్కి పటుకు,
రాజుగారి తోట్లో యేముందంటే
పువో మొగ్గో పుచ్చుకుంటే దెబ్బ
కాల్దీసి కడగా బెట్టు

## 24. బొంగరాలాట

చిలుకు చిలాట్,
ములుకు ములాట్,
పావుసేర్ - అద్దాసేర్
సవ్వాసేర్, గువ్వా దెబ్బా చూసుకో

## 25. గోళీలాట

గోళీలాటలో గొప్ప తత్వచింత ముంది తెలుసా
తాత గోళీకాయ పరమాత్మ.........
పిల్ల కాయగోళీజీవుడు .............
గుంట నిశ్చల తత్వం .................
పిల్ల గోళీకాయ అనే జీవుడు కర్మవి
మోచనము య్యేవరకు తాతగోళీని
తాకుతూ చివరకు గుంటలో పడుతుంది
అదే లాట కట్టడం............ విముక్తి

## 26. చిట్టి చిట్టి మిరియాలు

చిట్టి పొట్టి మిరియాలు
చెట్టుకింద పోసి,
పుట్ట మన్ను తెచ్చి
బొమ్మరిల్లు కట్టి
బొమ్మరింట్లో
బొగంపాప కన్నది
బిడ్డ తలకు చమురులేదు,
నాతలకు నూనె లేదు
అల్లవారింటికి చల్లకు పోతే
కలవారి కుక్క
భౌవు మన్నది !
నా కాళ్ళ గజ్జెలు
ఘల్లు మన్నవి !!!

## 27. గుడుగుడు కుంచం

గుడు గుడు కుంచం గుండేరాగం
పావడ పట్టం పడిగే రాగం
అప్పడాల గుట్టం ఆడుకోబోతే
పేపే గుట్టం పెళ్ళికి పోతే
అన్నా ! అన్నా ! నీ పెళ్ళెపుడంటే
రేపుగాక, ఎల్లుండి
కత్తీగాదు, బద్దాగాదు గప్, చిప్

## 28. చెమ్మ చెక్క

చెమ్మ చెక్క చేరెడేసి మొగ్గ
అట్లుపోయంగ, ఆరగించంగ,
ముత్యాల చెమ్మచెక్క ముగ్గులేయ్యంగ
రత్నాల చెమ్మచెక్క రంగులెయ్యంగ
పగడాల చెమ్మచెక్క పందిరెయ్యంగ
పందిట్లో మా బావ పెండ్లి చెయ్యంగ
చూచి వద్దాం రండి, సుబ్బారాయుడు పెండ్లి
(సూర్యాదేవుడి పెండ్లి, చూచివద్దాంరండి)
మా వాళ్ళింట్లో పెండ్లి మళ్ళీవద్దాం రండి,
దొరగారింట్లో పెండ్లి
దోచుకువద్దాం రండి.

## 29. సెత్తిమీద గోరింక

ఓ అ(బ్బా)మ్మాయి నెత్తిమీద గోరింక !
చెప్పకు చెప్పకు చెడిపోతావు,
చెపితే నీ ముక్కు తెగ్గోస్తా,
దూలం మీంచీ దూకిస్తా
పందిరి మీంచి పాకిస్తా,
కంచం అన్నం తినిపిస్తా
కడివెడు నీళ్ళు తాగిస్తా !

## 30. దాగుడు మూతలు

దాగుడు మూతా దండాకోర్
పిల్లీ వచ్చె ఎలుకా దాగె !
ఎక్కడి దొంగా లక్కడే
గప్ చిప్ - సాంబార బుడ్డి

## 31. ఒప్పుల కుప్ప

ఒప్పుల కుప్పా, వయారి భామ !
సన్నబియ్యం, చాయపప్పు,
చిన్ని మువ్వ, సన్నగాజు
కొబ్బరికోరు, బెల్లపచ్చు
గూట్లో రూపాయి, నీమొగుడు సిపాయి
(రోట్లు తవుడు, నీమొగుడెవరు ?)

## 32. నాలుగు స్తంభాలాట

నాలుగు స్తంభాలాటా నడిమికి తాడతిమికి,

తానక తప్పక, తనపేరేమంటే
ఉట్టి మీద బెల్లం పొట్టి కాకరకాయ,
బావా, బావా, బరుకూ, బరుకూ,
తనంల తింటే - తలకొకటి (తలకట్టు)

## 33. సందె గొబ్బె

సీతమ్మ వాకిటా, చిరుమల్లె చెట్టు,
చిరుమల్లె చెట్టే మొ చితుక పూసింది, (చిగిరించి పూసె)
చెట్టు కదలా కుండ కొమ్మ వంచండి,
పట్టి పూవులు కోసి, బుట్ట నింపండి,

అందులో పెద్దపూలు దండగుచ్చండె
దండతీసుకు వెళ్ళి సీతకివ్వండి,
దాచుకో సీతమ్మ, దాచుకోవమ్మ (రాముడంపాడు)

దాచుకోకుంటేనం, దోచుకుంటారు,
దొడ్డి గుమ్మములోన దొంగలున్నారు

## 34. గుమ్మాడమ్మా

గుమ్మాడమ్మా గుమ్మడి, ఆకుల్లు వేసింది గుమ్మడీ
పూవుల్లు పూసింది గుమ్మడీ, పండ్లు పండింది గుమ్మడీ
అందులో ఒకపండు గుమ్మడీ అతి చక్కని పండు గుమ్మడి
ఆ పండు ఎవరమ్మ గుమ్మాడి, మాచిట్టి తండ్రమ్మ గుమ్మడీ
మా చిట్టి తల్లమ్మ గుమ్మడీ

## 35. ఏనుగమ్మా ఏనుగు

ఏనుగమ్మా ఏనుగు! ఏ ఊరొచ్చింది ఏనుగు?
మా ఊరొచ్చింది ఏనుగు ఏం చేసింది ఏనుగు ?
మంచి నీళ్ళు తాగింది ఏనుగు

ఏనుగు ఏనుగు నల్లన్న,
ఏనుగు కొమ్ములు తెల్లన్న
ఏనుగు మీది రాముడు
ఎంతో చక్కని దేముడు

## 36. తారంగం

తారంగం తారంగం
తాండవకృష్ణా తారంగం
వేణునాథా తారంగం
వేంకట రమణా తారంగం,
వెన్నెల దొంగా తారంగం
చిన్ని కృష్ణా తారంగం

తారమయ్యా !
రవికుల రామచంద్రయ్యా !
తోడుపాశంతోడు,
తొంగల్లి రెప్పల్ల తోడు
ముద్దు మాణిక్యమ్ము తోడు,
మురహారి అక్కెప్పతోడు,
తోడుతే నీ చెయ్యి వేడి

జురుకో పాయసం జూరుకో !

## 37. చక్కిలి గింతలు

పసి బిడ్డలను పెద్దవారు దగ్గర కూర్చుండ బెట్టుకొని అరచెయ్యి పట్టుకొని ఈ క్రింది పదము చెప్పుతూ ఆయా పనులు చేస్తున్నట్లు అభినయిస్తూ చివరకు బిడ్డ చంకలో చక్కిలిగింత పెట్టుతారు బిడ్డనవ్వుతుంది.

ఇల్లలికి, ముగ్గేసి
పీటేసి, కంచం పెట్టి
పప్పుపెట్టి, పాయసం పెట్టి,
అన్నం పెట్టి, అప్పచ్చిపెట్టి
కూరపెట్టి, ఊరగాయపెట్టి,
నెయ్యివేసి, ముద్ద చేసి,
తినిపించి, తినిపించి,
చెయి గడిగి, మూతి గడిగి,
తాత (అత్త) గారింటికి దారేటంటే
ఇట్లా పోయి  ఇట్లా పోయి
ఇదుగో ఇదిగో, వచ్చాం వచ్చాం
చక్కా వచ్చాం చక్కా వచ్చాం
చక్కిలిగిలి చక్కిలిగిలిగిలి !

## 38. దీపారాధన

దీపం పెట్టగానే దీపానికి అరచేయి చూపి
అబ్బాయి కండ్లకు అద్దుతూ ఈ పాట పాడుతారు

రక్ష రక్ష ! సంధ్యరక్ష ! సర్వ రక్ష!
దీప రక్ష ! దివ్యరక్ష !
చిన్ని నా అబ్బాయికి / అమ్మాయికి
శ్రీరామరక్ష

## 39. గోరుముద్ద, గుజ్జుముద్ద

పసి బిడ్డలకు చిట్టి పిడతలతో అన్నము
మెత్తగా వండుదురు. ఈ మెత్త నన్నమును
కంచంలో గాని గిన్నెలో గాని కలిపి
గోరుముద్దలని, గుజ్జు ముద్దలని, పేర్లు
చెపుతూ తినిపిస్తారు. బొటన వేలి
గోరు మీదకు కొంచెముగా తీసుకొని
పెట్టేదాని పేరు గోరుముద్ద. కంచం
అంచున గాని గిన్నె అంచున కాని గీచి
ఎత్తి పెట్టేదాని పేరు గుజ్జుముద్ద.

## 40. వెన్నెల గుజ్జులు

వెన్నెల రాత్రులందు పసిబిడ్డలను
ఎత్తుకొని చందమామ ముచ్చట్లు
చెప్పుతూ ఆరుబైట అన్నము తినిపించటము తల్లుల అలవాటు.

చందమామ రావె ! జాబిల్లి రావె !
కొండెక్కి రావె ! గోగుపూలు తేవె !
బలవని పండు ఒళ్ళో ఉంచుకొని,
బల్చిన పండు చేత బుచ్చుకొని

వెండిగిన్నెలో వెన్న పెట్టుకొని,

పమిడి గిన్నెలో పాలు పోసికొని,

అమ్మా, నువ్వు తిందువుగాని

అట్టా అట్టా రావె ! చందమామ !

**పసిబిడ్డలకు మేలుకొలుపుతో ఆరంభించి జోల పాటతో ముగింపుకి వచ్చిన పుస్తకం ఇది.**

శ్రీ రమ్య దేహలాలీ ! మా ముద్దు

చిన్నారి కూన లాలీ !

గారాల కూచి లాలీ ! మా యప్ప

కంజాతనయన లాలీ !

సకల లోకా ధారుడు ! ముని మనో

జల జాత సంచారుడూ,

అకలంక గుణపురుడూ, మముబ్రోచు

ఆర్యా మనోహరుడూ

ఇందీవరేక్షణుడు, నిజభక్త,

బృందార కావనుండు

ఇందిందిలాలకుండూ, మముబ్రోచు

ఇందిరా నాయకుండు

శ్రీ వాగ్మనోధి నేత నిజభక్త

చింతితాభీష్ట దాత,

దేవేశు డా విధాత నీకుతా

దీర్ఘాయు వొసగు గాత !

బూచి వాని చిలువనంపనా

గోపాలబాల !

బూచి వాని బిలువనంపనా ?

బూచి వాని బిలువ నంపబోతె వద్దువద్దనేవు ?
బూచి ఇచ్చి, జలపోడి, యూచినాను నిదురబోవు
బూచివాని పిలువనంపనా ?
అల్లమూరగాయ పెరుగు అన్న మారగించుమంటే
వల్ల తేనె జొనలు కావలెను తెమ్ము తెమ్మనేవు ?
బంతి చేతికిచ్చి గోపాల యాడుకొమ్మనంటే
పంతగించి వేఱుచోట బంతులవిగో తెమ్మనేవు

బాగుగాను పూల పాన్పుపైన బవ్వళించుమంటే
నాగుబాము పడగ నెక్కి నాట్యమాడవలెననేవు

మత్తగజము తెచ్చి చిన్న తిత్తిలోపల నుంచి నా
నెత్తి మీద బెట్టి నన్నెత్తికో యశోదనేవు ?

రామశైల భద్రగిరి రామదాసు నేలుస్వామి
కామితార్థ ఫలము లొసగి కైవల్యము జూపువాడ
బూచివాని పిలువనంపనా ?